# మలిపొద్దు

తాటిపాముల మృత్యుంజయుడు

హైద్రాబాదులోని ఓల్డేజ్ హోం అది. ఆఫీసుగదిలో కేర్‌టేకర్‌కు నెలసరి లెక్కలు చూపిస్తున్నాడు అకౌటంట్. కేర్‌టేకర్ ఎదురుగా కూర్చుని ఉన్నారు రఘు, రామారావు.

ఆ వృద్ధాశ్రమంలో అరవై ఏళ్ల  పైబడిన వారు తమ జీవన చరమాం కాన్ని గడుపుతున్నారు. తనవారంటు ఎవరు లేని వాళ్లు, విదేశాల్లో ఉద్యోగాలు చేసే కొడుకులున్న వాళ్లు, కొడుకులు, కూతుళ్లు దగ్గరగానే ఉండికూడా నిరాదరణకు గురైన వాళ్లు, కుటుంబంతో ఉండటానికి అవకాశం ఉండికూడా,ఎవరిపై అధారపడకుండా జీవించాలనుకునే వాళ్లు, ఇలా ఎంతో మంది వృద్ధులు, వృద్ధురాళ్లు అక్కడ నివసిస్తున్నారు.

పద్దులు చూడటం అయిపోయాకా తలెత్తి చిరునవ్వుతో "చెప్పండి. ఏమి కావాలి?" అడిగింది కేర్‌టేకర్.

గొంతు సవరించుకొని "నా పేరు రఘు. వీరు మా నాన్నగారు, పేరు రామారావు. నేను అమెరికాలో యూనివర్సిటీలో అసిస్టెంట్‌ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. అక్కడే సెటిల్ అయ్యాను. నాన్నగారు గవర్నమెంట్ ఉద్యోగం చేసి ఐదు సంవత్సరాల క్రితమే రిటైర్ అయ్యారు. మీ ఓల్డేజ్ హోంలో చేరుదామనుకుంటున్నారు" చెప్పటం మొదలెట్టాడు రఘు. చివరి మాట అంటుంటే గొంతు పీలబోయింది.

"అయితే ముందుగా నేను కొన్ని ప్రశ్నలు అడగాలి" అంది కేర్‌టేకర్. పక్కనే ఉన్న నోట్‌పాడ్, పెన్ను తీసుకొంది.
"మీ అమ్మగారు ఎక్కడ ఉన్నారు?"
"మా అమ్మగారు కాలం చేసి పది సంవత్సరాలు అయ్యింది" చెప్పాడు రఘు.
"ఐ యాం సారీ టు నో దట్" రామారావు గారి దిక్కుచూస్తూ అంది కేర్‌టేకర్. ప్రశ్నలకు ఇస్తున్న జవాబులను కాగితం మీద రాసుకుంటున్నది.
"మరి ఇంత కాలం మీరెక్కడ ఉన్నారు?" రామారావును మాటల్లోకి దించాలని అడిగింది.
"మాకు హైద్రాబాదులో స్వంత ఇల్లు ఉంది. రిటైరయ్యాకా ఇంతకాలం ఆ ఇంట్లోనే ఉన్నాను"

"అయితే మీ నాన్నగారు ఇప్పుడు ఎందుకు ఈ హోంలో చేరాలనుకుంటున్నారు?"

"ఇంట్లో పని చెయ్యటానికి, వంట వండటానికి మనుషుల్ని పెట్టాను. ఇంతకాలం మా నాన్నగారు బాగానే మేనేజ్ చేసారు. కాని వయసు పైబడుతుంటే కొద్దిగా మతిపరుపు వచ్చింది. ఇంట్లో వస్తువులు, డబ్బులు పోవడం మొదలయ్యాయి. అలాగే పనివాళ్ళకు ఎన్ని డబ్బులు ఇచ్చినా సరిపోవడం లేదు. అమెరికాలో పనిచేస్తున్నానే అత్యాశతో డబ్బులు లాగడం మొదలెట్టారు. వాళ్ళ గొంతెమ్మ కోరికలు తీర్చలేక పోతున్నాము. ఇలాంటి బాధలనుండి తప్పించుకోవడానికి ఈ నిర్ణయం తీసుకొన్నాము."

"మరి మీ నాన్నగారికి మీరు తప్ప ఇంకెవరూ లేరా?"

"మా నాన్నగారికి నేనొక్కడినే. క్లోజ్‌గా అని చెప్పటానికి మా నాన్నగారి తరఫున, మా అమ్మగారి తరఫున చుట్టాలెవరూ లేరు. కొంతమంది తెలిసినవాళ్ళున్న ఎవరి సమస్యలు వాళ్లకున్నాయి. మా నాన్నగారు వేరే వాళ్లకు భారం కాకూడదని, వాళ్లకు ఇబ్బంది కలిగించ కూడదనే ఈ నిర్ణయం."

"అలా అయితే మీ నాన్నగారిని అమెరికాకు తీసుకెళ్ళొచ్చుగా? సారీ! ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. అడ్మిట్ చేసుకోబోయే ముందు మేం కొన్ని నియమాలు పాటించాలి" అనునయంగా అంది కేర్‌టేకర్.

"ఇట్స్ ఓకే! ఐ అండర్ స్టాండ్ రిటైర్ అయ్యాకా మానాన్నగారు ప్రతీ సంవత్సరం అమెరికా వచ్చి మాతో కొన్ని నెలలు ఉండేవాళ్ళు. నేను ఎయిర్‌ప్లేన్ టికెట్, వీసాకు అన్ని ఏర్పాట్లు చేసేవాణ్ణి. ఇంట్లో అన్ని సౌకర్యాలు కల్పించేవాణ్ణి. ఇవన్నీ అతనికి మనశ్శాంతిని ఇవ్వలేకపోయాయి. ఆ వివరాలేవో మా నాన్న చెబితేనే బాగుంటుంది" అంటూ నాన్న వైపు చూసాడు రఘు. 'చెప్పండి' అన్నట్టు చూసింది కేర్‌టేకర్. రామారావుగారు చెప్పటం మొదలెట్టారు.

"నా అబ్బాయి రఘు అమెరికాలో అన్ని ఏర్పాట్లు సవ్యంగానే చేస్తాడు. ఉండటానికి పెద్ద ఇల్లుంది. ప్రత్యేకంగా నాకో బెడ్రూం ఇస్తారు. కోడలు పిల్ల కూడా అప్యాయంగానే చూసుకుంటుంది. కాని అక్కడి దైనందిక జీవితం గడియారం ముల్లుకంటే ఎక్కువ వేగంగా పరిగెడుతుంది. పొద్దునలేస్తే పనులకు వెళ్ళిన కొడుకు, కోడలు సాయంత్రం చీకటిబడుతుంటే ఇంటికి చేరుకొంటారు. అక్కడ పుట్టిపెరిగిన మనవడు, మనవరాలి జీవనశైలి, పద్ధతులు వేరు. మొదట్లో నాతో బాగానే మసలేవాళ్లు. నేను వాళ్లని గారాబం చేసేవాడిని. వాళ్ల ముద్దుముద్దు మాటలతో కాలక్షేపం అయ్యేది. చేస్తున్న చిలిపిపనులను చూసి ఆనందిచేవాణ్ణి. కాని పెద్దవాళ్లవుతున్న కొద్దీ నా మాటలు, ప్రవర్తన వాళ్ళకు చాదస్తంగా అనిపిస్తున్నాయి. అప్పుడప్పుడు నా చేతలు భరించలేక, బయటకు చెప్పుకోలేక బాధపడటం నేను గమనించాను. నాకు, వాళ్ళకు మధ్య దూరం పెరిగింది. వాళ్ల జీవితాలు అమెరికాతో ముడిపడి ఉన్నాయి కాబట్టి వాళ్లకేం ఫర్వాలేదు. ఎటొచ్చీ వెళ్లిన నెల రోజులకే నేను ఒంటరితనం ఫీలవుతాను. బోరు కొట్టేస్తుంది. ఆ యాంత్రిక జీవితాన్ని భరించలేక డిప్రెషన్‌కు లోనవుతాను. ఈ వయసులో అక్కడి జీవనసరళికి అడ్జస్ట్ కావాలంటే నాకు ఓపిక, శక్తి లేవు. ఎన్ని రోజులున్నా ఒక 'ఎలీన్' లాగానే ఫీలవుతాను."

ఈ మాటల్ని వింటూ కేర్‌టేకర్ రఘు దిక్కు చూసింది. అది గమనించి రామారావుగారు మాట్లాడటం ఆపాడు.

సంభాషణని రఘు అందుకొని "ఈ మాటలు నాకేమి కొత్త గావు. ఈ విషయాలన్నింటినీ మేము చాలాసార్లు చర్చించుకొన్నాము. యూనివర్సిటీ దగ్గర్లో ఉన్న టౌన్‌లో మేము ఉంటాము. చుట్టుపక్కల పదిమైళ్ల దూరంలో ఇండియన్ ఫామిలీస్ చాలా అరుదుగా ఉన్నాయి. మాట్లాడటానికి ఎవరు లేకపోయేసరికి నాన్నగారు లోన్లీగా ఫీలవుతారు" అంటూ రామారావుగారి దిక్కు చూసాడు.

రామారావుగారు మాట్లాడుతూ "ఇక్కడ బయట అడుగిడితే ఇంతగా జనాన్ని చూసే నేను అక్కడ పల్చగా, విసిరివేయపడ్డట్టు ఉండే ప్రజల్ని చూసి ఆశ్చర్యపోతాను. అసలు రోడ్డుమీద నడిచేది నేనొక్కణ్ణేమో. ఒక్కసారిగా ఒంటరితనం ఆవహిస్తుంది. పార్కుకెడితే అంతకుముందు రోజు 'హాయ్' పలకరించిన మనిషి నిలబడి ఓ రెండు మాటలు ఎక్కువ మాట్లాడితే అదే పెద్ద విషయం నాకు. కారు డ్రైవ్ చెయ్యలేను కాబట్టి ఇంట్లో బందీలా ఫీలవుతాను." అన్నాడు.

ఇంకా కొన్ని ప్రశ్నోత్తరాల తర్వాత కేర్‌టేకర్ అప్లికేషన్ ఇచ్చింది. వివరాలన్ని నింపి రఘు, రామారావు గారు సంతకాలు చేసారు. సంవత్సరానికి అయ్యే ఖర్చులకు ఒకేసారి చెక్కు రాసాడు రఘు.
'థాంక్యూ!' అంటూ అప్లికేషన్, చెక్కు అందుకొంటుంటే వెనువెంటనే ఇంకో చెక్కు సంతకం చేసి ఇచ్చాడు.
"ఇది దేనికి?" అడిగింది కేర్‌టేకర్.

"మా నాన్నగారికి పెన్షన్ వస్తుంది. మేము అమెరికాలో కొద్దో, గొప్పో బాగానే సంపాదిస్తున్నాము. మీ వృద్ధాశ్రమానికి పది లక్షలు విరాళంగా ఇస్తున్నాను. అయితే ఇందులో కించిత్తు స్వార్థం కూడా ఉంది. మా నాన్నగారికి ఏవైనా స్పెషల్ సౌకర్యాలు అవసరమైతే, అదీ మీకు వీలైతేనే కల్పించండి. ఏ లోటు రాకుండా చూసుకుంటే దూరంగా ఉన్న నాకు మనశ్శాంతి ఉంటుంది. ఇంకా ఏమన్నా అదనపు ఖర్చులైతే చెప్పండి. డబ్బులు పంపిస్తాను."

రోజుకో కొత్తరకం కేసును చూస్తున్న కేర్‌టేకర్ వెళ్లిపోతున్న రఘు, రామారావును చూస్తూ 'గ్లోబలైజేషన్ యుగంలో ప్రపంచమంతా ఒక కుగ్రామంగా కుంచించుకు పోతుంటే మనసుల మధ్య మాత్రం అగాధం పూడ్చలేనంతగా పెరిగిపోతున్నది' అనుకుంది.

ఙఙఙఙఙఙ

యూనివర్సిటీలోని తన డిపార్ట్‌మెంట్‌లో కూర్చొని చెప్పబోయే క్లాసుకు తయారవుతున్నాడు ఇండియానుండి తిరిగి వచ్చిన ప్రొఫెసర్ రఘు. మధ్యమధ్యలో తండ్రి గుర్తుకు వచ్చి మనసు కకావికలమవుతున్నది. తప్పు చేసానేమోన్న భావన కలచివేస్తున్నది. చిన్నప్పుడు తండ్రి ఉదయమే నాలుగింటికి లేపి తనను స్కూటర్ పై 'ఇంజనీరింగ్ ఎంట్రన్స్ కోచింగ్' తీసుకెళ్లటం గుర్తుకు వచ్చి కళ్లు చెమ్మగిల్లాయి. 'అసలు తను అమెరికాకు ఎందుకు రావాలి. ఒక్కగానొక్క కొడుకునైన తను తండ్రిని వదలి ఇక్కడ ఎందుకుండాలి? తన కోసమా? తన పిల్లల భవిష్యత్తు కోసమా? మరి, అంతా ఖాళీ చేసి ఇండియా వెళ్లిపోతే ఏమౌతుంది?' ఇలా రకరకాల ప్రశ్నలు మనస్సులో గింగుర్లు తిరుగుతున్నాయి. అంత సులభంగా సమాధానం దొరకని ప్రశ్నలవి.

ఇంతలో రామారావుగారి నుండి ఈ-మెయిల్ వచ్చింది. చదవటం మొదలెట్టాడు.

చిరంజీవి ప్రొఫెసర్ రఘును దీవించి వ్రాయునది,

అవును, నేను నిన్ను ప్రొఫెసర్ అని సంబోధిస్తుంటే నాకు గర్వంగా ఉంటుంది. పెద్దగా చదువుకోని నా కుమారుడు పీ.హెచ్‌డీ. చెయ్యాలని కలలుగనేవాణ్ణి. నువ్వు ఏమాత్రం అ కలలను వమ్ము చేయకుండా కష్టపడి చదువుకొని వృద్ధిలోకి వచ్చావు. చూడచక్కని కుటుంబం, తెలివైన పిల్లలు. నా జీవితం సఫలమైనట్టే. నేను ఓల్డేజ్ హోంలో చేరానని నువ్వు ఏమి బాధపడవద్దు. నేను నీకు భారం అయి నువ్వే నన్ను వృద్ధాశ్రమంలో చేర్పించలేదుగా. ఇది నా స్వంత నిర్ణయం. దాన్ని మన్నించినందుకు కృతజ్ఞతలు. మన కాలనీలో నలుగురు ఏమనుకుంటారో ఏమో అని నువ్వు అపరాధభావం పెట్టుకోవద్దు. హృదయంతో విశాలంగా ఆలోచించని వాళ్ల గురించి నువ్వేమి సమయం వృధా చేసుకోవద్దు. ధీమాగా ఉండు. మంచి ఉద్యోగాల కోసం, ఉజ్జ్వల భవిష్యత్తుకోసం విదేశాలకు వెళ్ళుతున్న కుటుంబాలకు ఈ వృద్ధాశ్రమాలు ఒక పరిష్కారం. అయినా ఎందుకోగానీ ఈ వృద్ధాశ్రమాలను మనవాళ్ళు సహృదయంతో ఆహ్వానించటం లేదు. మొదట్లో ఏ మార్పుకైన ప్రతిఘటన ఉంటుంది కదా.

నేను అమెరికాలో చూసాను. నీక్కూడా తెలుసు. అక్కడ రిటైర్మెంట్ కమ్యూనిటీస్ అని ప్రభుత్వమే అపార్ట్‌మెంట్స్ కట్టిస్తుంది. ఓల్డేజ్ హోంలు చాలా ఉన్నాయి. మన పురాణాల్లో చెప్పినట్టు వృద్ధాశ్రమంలో వానప్రస్థానానికి వెళ్ళినట్టు, అక్కడ అందరూ స్వతంత్రంగా ఓల్డేజ్ హోంలో బతుకుతారు.

ఇక్కడ నా జీవితం చాలా బాగుంది. నా వయసువాళ్ళు కొందరు స్నేహితులయ్యారు. నా శరీరతత్వానికి అలవాటైన వాతావరణం కాబట్టి అక్కడిలాగా ఆరోగ్యసమస్యలు ఏమీలేవు. అన్నట్టు నేను ఎదో కాలక్షేపం మాత్రమే చేయకుండా వీలైనంతలో ఈ ఆశ్రమనిర్వహణలో సహాయంకూడా చేస్తున్నాను. దానివల్ల నాకు సంతృప్తికూడా దొరుకుతున్నది.

చివరిరోజు వరకు నా ఆరోగ్యం ఇలానే ఉండాలని నేను భగవంతుణ్ణి సదా ప్రార్థిస్తున్నాను. అప్పుడప్పుడూ ఫోను చేస్తుండు. నువ్వు, కోడలు తప్పకుండా వీలుచూసుకొని వచ్చి నాకు నా మనవడిని, మనవరాలిని చూపెడుతుండాలి.

ఆలోచిస్తుంటే నాకు ఒక విషయం బోధపడుతున్నది. మనిషి బయటకు సంఘజీవి అయినా లోలోపల ఎల్లప్పుడు ఒంటరి వాడే స్వతంత్రాన్ని కోరుకునే వాడే

ఉంటాను.
ప్రేమతో నీ నాన్న!

చదవటం పూర్తిచేసిన రఘు మనసు కొంచెం కుదుటపడింది. ఇంతలో క్లాసు టైం అవటంతో లేచి బయటకు అడుగు వేసాడు.

This document was created with Win2PDF available at http://www.win2pdf.com.
The unregistered version of Win2PDF is for evaluation or non-commercial use only.
This page will not be added after purchasing Win2PDF.